గురు వారం
18-05-2023
సంపుటి - 08,
సంచిక - 312
పేజీలు - 4
వెల రూ. 5/-
Telangana
Andhra Pradesh
CEO & Editor : G. PRUDHVIRAJ

RNI NO: TELTEL/2016/73311

www.samasamajam.in

# సమ సమాజం

SAMA SAMAJAM TELUGU DAILY

తెలుగు దిన పత్రిక

❍ Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole

# అక్రమ మద్యం వాడితే కఠిన చర్యలు



- ఎంతటివారైనా జైలుకు పంపిస్తాం
- మంత్రి శ్రీనివాసగౌడ్ హెచ్చరిక

**హైదరాబాద్,మే17(సమసమాజం):** తెలంగాణలో గత కొన్ని రోజులుగా ఇతర రాష్ట్రాలు, విదేశాల నుంచి మద్యం అక్రమ రవాణా జరుగుతోందని తెలంగాణ ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి మద్యం, తేవద్దు.. ఇక్కడ తయారైన బాటిల్స్ మాత్రమే విక్రయించాలని సూచించారు. నగరంలోని రాజేంద్రనగర్ లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మద్యం అక్రమ రవాణాపై పలు విషయాలు ప్రస్తావించారు. విదేశాల నుండి, ఇతర రాష్ట్రాల నుంచి మద్యం అక్రమ రవాణా చేస్తే ఎంతటి వారైనా సరే కేసులుపెట్టి జైలుకు పంపిస్తామని మంత్రి శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. తెలంగాణలో ఎక్కడ ఫంక్షన్ జరిగినా తెలంగాణ లేబుల్ లేకుండా మద్యం సంబరాలు జరుగుతున్నాయి. దీనివల్ల కల్తీ మద్యం సరఫరా అయ్యే అవకాశం ఉందన్నారు. కల్తీ మద్యం అమ్మడం, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చేటప్పుడు మద్యం తీసుకురావడం నేరం అన్నారు మంత్రి. గత వారం రోజుల్లోనే ఇతర రాష్ట్రాల నుంచి 1,333 బాటిల్స్ దిగుమతి అయ్యాయని తెలిపారు. ఒరిస్సాలో మద్యం అడవుల్లో తయారు చేసి ఇక్కడ విక్రయిస్తున్నారు. హర్యాణ నుంచి వస్తున్న అక్రమ మద్యాన్ని కూడా పట్టుకున్నాం అన్నారు. మద్యం అక్రమ రవాణా ప్రమాదకరం అని, విదేశాల నుంచి వచ్చే వారికి మాత్రమే ఒక వ్యక్తికి రెండు బాటిళ్లు అనుమతి ఉందని మంత్రి శ్రీనివాస్ గౌడ్ స్పష్టం చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి తెలంగాణలోకి మద్యం సరఫరా చేయడం నేరమని, చిక్కుల్లో ఇరుక్కుంటారని హెచ్చరించారు. భారతదేశ ప్రజలు గత కొన్ని నెలలుగా ద్రవ్యోల్బణం తాకిడిని ఎదుర్కొంటున్నారు. ఆహార పదార్థాల నుంచి నిత్యావసరాల వరకు అనేక వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయి. దీంతో, ప్రజలు నిత్యావసరాల కొనుగోళ్లను కూడా తగ్గించుకున్నారు.

2వ పేజీలో...

# కర్నాటక సిఎం పదవిపై వీడని ఉత్కంఠ

జాతీయ మీడియాలో సిద్ధరామయ్య అంటూ ప్రచారం

రంగంలోకి దిగి వార్తలను ఖండించిన సూర్జేవాలా



**న్యూఢిల్లీ,మే17(సమసమాజం):** కర్ణాటక తదుపరి ముఖ్యమంత్రి ఎవరనే దానిపై కర్ణాటక కాంగ్రెస్ ఇన్‌చార్జి రణ్‌దీప్ సింగ్ సూర్జేవాలా ఊహించని ట్విస్ట్ ఇచ్చారు. పార్టీ అధిష్ఠానం ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, ఒక నిర్ణయానికి రాగానే వెంటనే తెలియజేస్తామని మీడియాకు చెప్పారు. కర్ణాటక కొత్త సీఎం సిద్ధరామయ్యేనంటూ జాతీయ మీడియాలో వార్తలు గుప్పుమన్న కొద్దిసేపటికే రణ్‌దీప్ సింగ్ సూర్జేవాలా మీడియా ముందుకు వచ్చారు. సాధ్యమైనంత తొందర్లోనే ఒక నిర్ణయం తీసుకుంటామని మల్లికార్జున్ ఖర్గే చెప్పారని, ప్రస్తుతం ఎవరూ ఎలాంటి ఊహాగానాలు చేయడం కానీ, వదంతులు వ్యాప్తి చేయడం కానీ చేయవద్దని కోరారు. రాబోయే 48 నుంచి 72 గంటల్లో కర్ణాటకలో కొత్త ప్రభుత్వం ఏర్పాటవుతుందని సూర్జేవాలా వివరించారు. బుధవారం ఉదయం నుంచే సిద్దరామయ్య ఎంపిక ఖాయమైనందని, బెంగళూరులోని ఆయన నివాసం వద్ద భారీ భద్రతా ఏర్పాట్లు జరుగుతున్నాయని వార్తలు వచ్చాయి. ఇందుకు అనుగుణంగా శ్రీ కంఠీరవ స్టేడియంలో ప్రమాణస్వీకారం ఏర్పాట్లు జరుగుతున్నాయి. బెంగళూరులోని సిద్దరామయ్య నివాసం వద్ద అభిమానులు ఆయన బ్యానర్లకు పాలాభిషేకం చేయగా, సీఎం రేసులో ఉన్న డీకే శివకుమార్ అభిమానులు ఢిల్లీలోని రాహుల్ నివాసం వెలుపల గుమిగూడారు. ఈ నేపథ్యంలో పరిస్థితులను నిశితంగా గమనించి ఆ తరువాతే తుది నిర్ణయాన్ని ఖర్గే ప్రకటించనున్నారని తెలుస్తోంది. కర్ణాటక సీఎం సిద్దరామయ్య అంటూ వచ్చిన వార్తలు, కాంగ్రెస్ పార్టీ సోర్స్ పై.. ఆ పార్టీ అధిష్ఠానం యూటర్న్ తీసుకుంది. సీఎం ఎవరు అనే విషయంపై ఇంకా చర్చలు జరుగుతున్నాయని.. ఫైనల్ కాలేదని.. దానికి ఇంకా 48 గంటల సమయం పట్టొచ్చు అంటూ ఆ పార్టీ కీలక నేత సూర్జేవాలా ప్రకటించారు. చర్చలు ఇంకా జరుగుతున్నాయని వెల్లడించిన ఆయన.. కర్ణాటక సీఎం ఎవరు అనేది నిర్ణయించిన తర్వాత స్వయంగా ప్రకటిస్తామని వెల్లడించారు. మే 17వ తేదీ బుధవారం ఉదయం జాతీయ

2వ పేజీలో...

ఈవెంట్ నిర్వాహణ సరిగ్గా చెయ్యలేదంటూ 7 లక్షల రూ॥ ఎగవేతకు ప్లాన్...

ఈవెంట్ మేనేజర్‌పై ఉల్టా...ఫిర్యాదు

కుమారుడి పెళ్లి వేడుకకు ఈవెంట్ వర్కర్లుగా పార్ట్‌టైమ్ జాబ్ చేసిన విద్యార్థులు, మహిళలు, ఈవెంట్ సిబ్బంది ఆందోళన

# చల్లమల్ల నీకిది న్యాయమా!

యువతితో దుర్భాషలాడిన చల్లమల్ల కుమారుడు ! ● ఈవెంట్ మేనేజర్ ఆవేదన

25 చెల్లింపు ● మొత్తం ఈవెంట్ 32 లక్షలు ● మిగతా డబ్బు చెల్లించనందుకే రభస



## నాపై ప్రతిపక్షాలు, కొందరు వ్యక్తులు కుట్ర చేస్తున్నారు

*- చల్లమల్ల కృష్ణారెడ్డి*

ఈవెంట్ కార్యక్రమానికి సంబంధించి మొత్తం రూపాయలను సదరు ఈవెంట్ మేనేజ్‌మెంట్‌కు సెటిల్ చేశాము. వర్కర్లకు మాకు ఎలాంటి సంబంధం లేదు. ఈవెంట్ మేనేజర్ ఇవ్వాల్సి ఉంటే నా ఇంటి దగ్గరకు వచ్చి ఆందోళన చేయటం తగదు. ఇది ప్రతిపక్షాలు మరియు వ్యక్తిగతంగా కొందరు కావాలని నా పై కుట్ర చేస్తున్నారు.

## నా డబ్బులు నాకు ఇస్తే చాలు

*- విశాల్, ఎం.డి*
@9963886089

మా సంస్థ పేరు ఇవెంటో ఎంటర్టైన్‌మెంట్ సంస్థ. చాలా మంది ప్రముఖులకు మా సంస్థ ఈవెంట్ చేసింది. ఎక్కడ కూడా రిమార్క్ లేదు. ఈ ఈవెంట్‌కు మొత్తం 32 లక్షలకు ఈ ఈవెంట్ ఒప్పుకున్నారు. వారు చెప్పినట్లు సర్వీసు అందించలేదని వారి వాదన. అందుకు రెండు లక్షలు కట్ చేసుకోని మిగతా 5 లక్షలు ఇస్తే చాలు. అంతే కాని ఈవెంట్ మేనేజర్‌గా వ్యవహరించిన యువతిని పట్టుకొని అడ్డగోలుగా దూషించడం తగదు. దీనిని రాజకీయాలకు సంబంధం లేదు. డబ్బు ఇవ్వమని చాలా రిక్వెస్ట్ చేశాము. తర్వాత ఆందోళన చేశాము. ఇంటి ముందు ఆందోళన చేసిన వారంతా మా వర్కర్లే.





## నోటి దూలా.. అహంకారమే ఎగవేతకు కారణం!

చల్లమల్ల అత్యంత సంపన్నుడని, కోట్ల రూపాయలు ఖర్చు చేసి అంగరంగ వైభవంగా పెద్ద కొడుకు పెండ్లి చేశాడని, కేవలం 7 లక్షల రూపాయల కోసం పేరు చెడగొట్టుకుంటారా !!.. ఇది నమ్మదగిన విషయమేనా అని మునుగోడు నియోజకవర్గ ప్రజలు భ్రమపడుతున్నారు. కాని ఇది వాస్తవం. కేవలం అక్షరాల ఏడు లక్షల రూపాయలను ఈవెంట్ సంస్థకు ఎగవేసే ప్రయత్నం చేశారు. పైగా చల్లమల్ల చిన్న కుమారుడు దుర్భాషలాడటంతో సదరు ఈవెంట్ ఇంఛార్జ్ యువతి కావడం మనస్తాపానికి గురై, అందులో పనిచేసిన వర్కర్లతో చల్లమల్ల ఇంటి ముందు ఆందోళనకు దిగారు. చల్లమల్ల డబ్బు కట్టలేక కాదు కేవలం నోటి దూలా.. అహంకారమే అందుకు కారణంగా తెలుస్తుంది.

పేరు గొప్ప మనస్సు దిబ్బ అన్నట్లుగా ఉంది చల్లమల్ల వ్యవహారం. కేవలం ఏడు లక్షల రూపాయలు ఇవ్వకుండా జాప్యం చేయడంతో చల్లమల్ల పరువు బజారున పడింది. వాస్తవానికి ఈ ఈవెంట్ ఆన్‌లైన్‌లో రేటింగ్‌ను చూసి బుక్ చేసుకున్నారు. ఇట్టి ఈవెంట్ సంస్థ ఈవెంటో ఎంటర్టైన్‌మెంట్ సంస్థ నిర్వహించింది. సంస్థకు ఆన్‌లైన్‌లో మంచి రేటింగ్ ఉండటంతో చల్లమల్ల కుమారుడైన వినిత్‌రెడ్డి 32 లక్షలకు ఈవెంట్ నిర్వహణకు అయ్యే ఖర్చుగా ఒప్పందం కుదుర్చుకున్నారు. అయితే ఈవెంట్ అయిపోయిన వెంబడే 25 లక్షల రూపాయలను ఈవెంట్ నిర్వహించిన సంస్థకు అందజేశారు. తరువాత మిగతా డబ్బు చెల్లించాలని ఈవెంట్ ఇంఛార్జ్ కోరగా చల్లమల్ల కుమారుడైన వినిత్‌రెడ్డి ఆగ్రహంతో యువతి అని చూడకుండా చెప్పరాని మాటలతో దుర్భాషలాడాడని ఆవేదన వ్యక్తం చేశారు ఆ సంస్థ ఎం.డి విశాల్. మాకు సమస్యను రాజకీయం చేయొద్దని అన్నారు.



సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం.. వీరంతా ఈవెంట్ వర్కర్లే - విశాల్

**రంగారెడ్డి,మే18(సమసమాజం):** తరుచూ వివాదాస్ప దుడిగా వార్తల్లో నిలుస్తూ ప్రజల దృష్టిని మరల్చుకుంటున్న టిపిసిసి ప్రధాన కార్యదర్శి, మునుగోడు ఇంఛార్జీగా చలామణి అవుతున్న చల్లమల్ల కృష్ణ రెడ్డికి చేదు అనుభవం ఎదురైంది. ఇటీవల తన కుమారుడి పెళ్లి వేడుక ఘనంగా నిర్వహించారు. పెండ్లి శుభకార్యానికి సంబంధించి ఈవెంటో ఎంటర్టైన్‌మెంట్ సంస్థ ద్వారా డెకరేషన్ వంటి కార్యకలాపాలకు సంబంధించి ఏర్పాట్లకు 32 లక్షలకు గాను ఒప్పందం కుదుర్చుకున్నారు. దానికి సంబంధించి కార్యక్రమం అయ్యిపోయిన తరువాత 25 లక్షల రూపాయలను ఈవెంట్ ఇంఛార్జ్‌గా వ్యవహరించిన యువతికి ఇచ్చారు. మిగతా డబ్బులను ఎప్పుడు ఇస్తారు అని సంప్రదించగా చల్లమల్ల రెండవ కుమారుడైన చల్లమల్ల వినిత్‌రెడ్డి సదరు యువతిని దుర్భాషలాడినట్లు ఈవెంట్ మేనేజర్, సంస్థ ఎండీ విశాల్ ఆరోపించారు. ఈ సందర్భంగా విశాల్ మాట్లాడుతూ ఈవెంట్‌కు సంబంధించి మీరు అనుకున్నట్లు మేము చెయ్యలేదు అని అనిపిస్తే ఒప్పుకున్నకాడికి కాకుండా కొంత అమౌంట్ కట్ చేసుకొని ఇవ్వాలని రిక్వెస్ట్ చేశామని, ఆడపిల్ల అని చూడకుండా దూషనలు చేయటం తగదని అన్నారు. ఏడు లక్షలు వారికి పెద్ద సమస్య కాదని, కావాలనే మమ్ములను టార్గెట్ చేసి వేదించారని అన్నారు. మాకు రాజకీయాలతో సంబంధం లేదని, మాకు రావల్సిన డబ్బు మాకు ఇస్తే వెల్లిపోతామని అన్నారు. ఈవెంట్ చేయడం అంత సులువు కాదని, మీము ఒప్పుకున్న టైమ్‌కు వారికి అందించాలని సదుద్దేశంతో ఎక్కువ మంది వర్కర్లైనా పర్వాలేదని, మా సంస్థకు చెడ్డ పేరు రావొద్దు అని తగు జాగ్రత్తలు తీసుకుంటామని అన్నారు. ఈవెంట్ చేసిన తరువాత పార్ట్‌టైమ్ జాబ్ చేసే స్టూడెంట్స్‌కు, వర్కర్లకు ఇవ్వల్సిన డబ్బులు వీరు పెండింగ్ పెట్టడం వల్ల ఇవ్వలేక పోయామని అన్నారు. అందుకే వారు చల్లమల్ల ఇంటి ముందు ఆందోళనకు దిగారని అన్నారు. చల్లమల్ల కృష్ణారెడ్డి మాట్లాడుతూ సరైన సమయంలో మేము ఒప్పుకున్న డబ్బులు చెల్లించామని, బీఆర్ఎస్, బీజేపీ, కొందరు గిట్టనివారు నాపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. మా ఇంటి ముందు ఆందోళన చేసిన వారిపై, ఈవెంట్ వారిపై పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు.

ఇదిలా ఉంటే మునుగోడు నియోజకవర్గ సోషల్ మీడియాలో బీఆర్ఎస్ కార్యకర్తలు చల్లమల్ల ఇంటి ముందు ఆందోళన చేశారని తప్పుడు ప్రచారం చేస్తూ, 7 లక్షల రూపాయల ఎగవేతను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేసి విఫలం అయ్యారని, నిజాన్ని ఎంత దాగబెట్టినా మునుగోడు నియోజకవర్గ ప్రజలు అసలు వాస్తవాన్ని తెలుసుకుంటున్నారు.

# ఇప్పటికిప్పుడు ఎన్నికలు పెడితే 105 సీట్లు

- 9ఏళ్లలో చేసిన పనులు చెబితే చాలు
- చెరువు గట్ల మీద మీటింగ్ పెట్టి చెప్పండి
- రైతులతో కలసి గట్ల మీద భోజనం చేయండి
- బిఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశంలో కెసిఆర్
- దశాబ్ద కాలంలోనే శతాబ్దకాలం పనులు చేశా: జగదీశ్ రెడ్డి

**హైదరాబాద్,మే17(సమసమాజం):** బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశంలో ముఖ్యమంత్రి కేసీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. వచ్చే ఎన్నికలకు సంబంధించి ప్రజా ప్రతినిధులు ఎలా సమాయత్తం కావాలో సూచించారు. ఇప్పటిదాకా తమ ప్రభుత్వం చేసింది చెప్పుకుంటే చాలని చెప్పారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏం చేసిందో ప్రజలకు తెలియజెప్పాలని నిర్దేశించారు. రైతులను చెరువుల దగ్గరకు పిలిచి మీటింగ్ పెట్టాలని, చెరువు గట్ల మీద రైతులతో కలిసి భోజనం చేయాలని చెప్పారు. గత 70 ఏండ్లలో కాంగ్రెస్ చేసింది ఏమి లేదని, వాళ్ళను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. ఇప్పటికి ఇప్పుడు ఎన్నికలు వస్తే బీఆర్ఎస్ పార్టీ 105 సీట్లు సాధిస్తుందని కేసీఆర్ విశ్వాసం వ్యక్తం చేశారు. తెలంగాణలో ఎన్నికలకు ఇంకో 5 నెలలు మాత్రమే సమయం ఉందని అన్నారు. జూన్ 2న తెలంగాణ అవతరణ ఉత్సవాల నిర్వహణపై కూడా సీఎం కేసీఆర్ కీలక సూచనలు చేశారు. మంత్రులు ఆయా జిల్లాలలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను పర్యవేక్షించాలని నిర్దేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ తరపున కూడా గ్రామ, గ్రామాన వేడుకలు ఘనంగా నిర్వహించాలని నేతలను ఆదేశించారు. కర్ణాటక ఎన్నికలపై కూడా కేసీఆర్ ప్రత్యేకంగా ప్రస్తావించినట్లు తెలిసింది. సీఎం కేసీఆర్‌అధ్యక్షతన బీఆర్ఎస్

2వ పేజీలో...



## సంపాదకీయం

# పీడనల ముక్త భారత్ కావాలి !

కాంగ్రెస్ విముక్త భారత్ అన్న మోడీ పిలుపునకు బలం లేదని...ఆయన రాజకీయ ఎత్తుగడలు సాగవని కర్నాటకలో ప్రజలు నిరూపించారు. అంతకుముందు హిమాచల్‌లోనూ ఇదే తరహాలో ప్రజలు ఆలోచన చేశారు. పంజాబ్‌లోనూ అదే జరిగింది. ప్రజలకు కావాల్సింది ఇది కాదు..కాంగ్రెస్ ముక్త భారత్‌తో సాధించిం దేమిటన్నది కావాలి. ప్రజల సమస్యలు ముక్తం కావాలి. ప్రజలకు పీడనలు విముక్తి కావాలి. నిరుద్యోగం విముక్తం కావాలి. ఇవన్నీ పక్కన పెట్టి తామేదో గొప్పలు చేశామని..9 ఏళ్లలో దేశం అద్భుతంగా ఉందని చంకలు గుద్దుకుని ఓట్లేయమంటే ప్రజలు ఆమోదించలేరని కర్నాటక ఎన్నికల ఫలితాలను బట్టి బిజెపి అగ్రనేతలు గుర్తించాలి. నిజానికి కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విజయానికి పెద్దగా ప్రత్యేకత ఏమీ లేదు. పనిచేయని ప్రభుత్వాన్ని ఇంటికి పంపారు. అక్కడ ఓట్ల శాతం పెరిగిందా..తగ్గిందా..ఓటుశాతం స్థిరంగా ఉందా అన్నది కూడా ప్రజలకు ముఖ్యం కాదు. ఓడించాలనుకున్నప్పుడు ఒక్క ఓటుతో అయినా ఓడిస్తారు. ఇలాంటి పెడాలోచనలను పక్కన పెట్టి ప్రజల సమస్యలపై తక్షణమే చర్యలకు దిగాలి. దేశాన్ని పట్టిపీడిస్తున్న సమస్లయతో పోరాడాలి. ధరల నుంచి సామాన్యులకు విమక్తి కలిగించాలి. ఉద్యోగాలు ఇచ్చి నిరుద్యోగులకు విమక్తి కలిగించాలి. జిఎస్టీ వడ్డింపులనుంచి విముక్తం చేయాలి. గ్యాస్ ధరలనుంచి విముక్తం చేయాలి. ఇవన్నీ చేస్తూ..ఇప్పుడు చేశామని చెప్పుకుంటున్న పనుల గురించి చెబితే ప్రజలు నమ్ముతారు. అప్పుడే వారు కాంగ్రెస్ ముక్త భారత్‌కు దోహదపడతారు. లేదంటే బిజెపి ముక్త భారత్ అంటూ బయలుదేరే విపక్షాల వెంట నడుస్తారు. నిజానికి కర్నాటకలోఅయిదు సంవత్సరాలకోసారి ప్రత్యామ్నాయ ప్రభుత్వం వస్తూనే ఉంటుంది. 2018లో కాంగ్రెస్ మద్దతుతో ఏర్పడిన కుమారస్వామి ప్రభుత్వాన్ని భారతీయ జనతా పార్టీ 2019లో కుట్రపూరితంగా కూల దోసింది. ఒకవేళ అలా జరిగి ఉండకపోయినా కుమారస్వామి ప్రభుత్వం అంతర్గత కలహాలతో ఎప్పుడో కూలిపోయేది. ఒకవేళ ఐదేళ్లు కొనసాగివుంటే ఈ ఎన్నికల్లో మట్టికరిచేది. అక్కడ ఎమ్మెల్యేలను ఏమార్చి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రజల ఆకాంక్షలను పట్టించు కోలేదు. ఇది నూటికినూరుపాళ్లు నిజం. అవినీతిలో కూరుకుపోయింది. కమిషన్ల ప్రభుత్వంగా ఘనత వహించింది. దేశంలో ఎక్కడా లేనంత అవినీతి, అరాచక పాలన సాగుతున్నా మోదీ అడ్డుకోలేకపోయారు. సరికదా అంతర్గత కలహాలతో చచ్చుపడిని కాంగ్రెస్‌ను మరోసారి ఓడించ వచ్చని మోడీ ద్వయం భావించి ఉంటుంది. అందుకే కర్ణాటకకు పదేపదే వచ్చి ఊరూ వాడా తిరిగినా ప్రజలు స్పందించలేదు. ఇదంతా కూడా ప్రజల్లో గూడుకుట్టుకుని ఉన్న ఆవేశానికి కారణమని గుర్తించలేక పోయారు. ఎన్ని టక్కుటమార విద్యలు ప్రదర్శించినా.. కాంగ్రెస్‌ను గెలిపించాలన్న బలమైన కసి ప్రజల్లో కనిపించింది. అందుకే గతంలో ఎన్నడూ లేనంత భారీ మెజారిటీతో కాంగ్రెస్ గెలవగలిగింది. కర్ణాటక ఎన్నికలు సమీపిస్తున్నాయని తెలిసినా రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేయించారు. ఇల్లు ఖాళీ చేయించారు. కాంగ్రెస్ తనను ఏమీ చేయలేదనేది ఆయన ధీమా సరికాదని తెలిసింది. కాంగ్రెస్‌పై, ప్రతిపక్షా లపై, బిజెపియేతర ప్రభుత్వాలపై నిజంగానే మోడీకి చిన్నచూపు ఉన్నది. విపక్ష నేతలనందరినీ కేసుల్లో ఇరికించినా, ఈడీ, సిబిఐ దాడులు చేయించినా తననేమీ చేయలేరనే అతి ఆత్మవిశ్వాసంతో సాగుతున్నారు. పార్లమెంట్ అంటే లెక్కేలేదు. సమస్యలను చర్చించే సందర్భాలు రానీయరు. చర్చించడానికి ముందుకు రారు. దర్యాప్తు సంస్థలను కేవలం విపక్షాలపై ఉసిగొలిపేందుకు ఉపయోగించి పలు రాజ్యాంగ వ్యవస్థలతో చెలగాటమాడారు. పార్టీలో ఉన్న వారి పట్ల కూడా మోడీ ఉదారంగా వ్యవహరించారా అంటే అదీ లేదు. కర్ణాటకలో సీనియర్ నేత యడ్యూరప్పతో పాటు అనేకమంది నేతలను లొంగదీసుకునే ప్రయత్నం చేశారు. లింగాయత్‌ల అధిపత్యాన్ని అంగీకరించేది లేదన్నారు. తాను పోటీ చేయమన్న చోట పోటీ చేయాల్సిందే నన్నారు. అనేకమంది సీట్లు మార్చారు. లింగాయత్, ఒక్కలిగలు మాత్రమే కాదు, బీసీలు, ఎస్‌సిలు, ఎస్‌టిలు కూడా అత్యధిక సీట్లు కాంగ్రెస్‌కు అప్పజెప్పారు. భారత రాజకీయాల్లో మతం కన్నా కులం పాత్ర బలంగా ఉంటుందని మరోసారి తేలింది. బిజెపి విద్వేష రాజకీయాలను పౌర సమాజం, విద్యావంతులతో పాటు సామాన్యులు కూడా వ్యతిరేకిస్తు న్నారన్న విషయాన్ని కర్ణాటక ఎన్నికలు రుజువు చేశాయి. ఇదంతా కూడా ప్రజలు తమ ఆలోచన మేరకు నడుచుకున్నారనడానికి నిదర్శనం.బీజేపీ విధానాల పుణ్యమా అని మైనారిటీలు పూర్తిగా కాంగ్రెస్ పార్టీ వైపే మొగ్గు చూపారు. శిఖండిపాత్ర పాత్ర పోషించే జనతాదళ్ (ఎస్)కు గట్టిగా బుద్ది చెప్పారు. ప్రజా వ్యతిరేకత ఉన్న విషయాన్ని గుర్తించడంలో కమలనాథులు విఫలమయ్యారు. అందుకు తగిన మూల్యం చెల్లించారు. ఇదే పరిస్థితి ఇకముందు మిగతా రాష్ట్రాల్లో రాకుండా బిజెపి నేతలు ముందుకు సాగాలి. కేవలం కాంగ్రెస్ ముక్త భారత్ నినాదం కాదని, ప్రజల పీడనలు ముక్తం అయ్యేలా కృషి చేయాలన్న సోయి తెచ్చుకోవాలి. లేకుంటే ఆత్మరక్షణలో పడక తప్పదు. డబుల్ ఇంజన్ సర్కార్ గురించి ఎంత ఊదరగొట్టినా ఒనగూరే ప్రయోజనం ఉండదని కూడా గుర్తించాలి. మోదీ తనను తాను ఎక్కువగా అంచనా వేసుకుని దైవాంశ సంభూతుడిగా, భారతదేశ జనోద్ధారకుడిగా చేసుకునే ప్రచారాలు ఆపాలి. ప్రజల్లో వివిధ అంశాలపై ఉన్న వ్యతిరేకతను మోదీ, అమిత్ షాలకు చెప్పే ధైర్యం ఎవరికీ లేదు. ప్రజలకు మంచి చేస్తే ప్రజలే కాంగ్రెస్ ముక్త భారత్‌ను ఆమోదిస్తారు. వారే అందుకు ముందుంటారు. కానీ మంచి పనులు చేయకుండా గొప్పలు చేశామని ప్రచారార్భాటాలకు దిగరాదు. దేశంలో ఎక్కడైనా తామే చక్రం తిప్పగల మని, తమ ఇష్టారాజ్యం గా వ్యవహరించి నెగ్గుకు రాగలమని భావించడం సరికాదు. కర్ణాటక ఫలితాల అనుభవంతో, తాను ఇచ్చిన కాంగ్రెస్ విముక్త భారత్ నినాదం సరైనదా అని మోడీ పునరాలోచించాల్సి ఉంది. .

# విజయవాడలో ముగిసిన యజ్ఞం

## పూర్ణాహుతిలో పాల్గొన్న సిఎం జగన్, మంత్రులు





**విజయవాడ,మే17(సమసమాజం):** విజయవాడలో జరుగుతున్న యజ్ఞం అఖండ పూర్ణాహుతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. ముఖ్యమంత్రికి పూర్ణకుంభంతో వేద పండితులు స్వాగతం పలికారు. శ్రీమహాలక్ష్మి అమ్మవారికి సిఎం జగన్ పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో విశాఖ శ్రీశారదా పీఠాధిపతి శ్రీ స్వరూపానందేంద్ర స్వామి, శ్రీ శారదా పీఠం శ్రీ మహాలక్ష్మి అమ్మవారికి సీఎం వైయస్.జగన్ పట్టుచీర సమర్పించారు.. అఖండ పూర్ణాహుతి కార్యక్రమంలో పలువురు పీఠాధిపతులు పాల్గొన్నారు. పూర్ణాహుతి కార్యక్రమంలో హోంశాఖ మంత్రి తానేటి వనిత, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, గృహనిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్, టీటీడీ చైర్మన్ వై వి సుబ్బారెడ్డి దంపతులు, పలువురు ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



ఉత్తరాధికారి శ్రీస్వాత్మానందేంద్ర స్వామి, అవధూత పీఠాధిపతి గణపతి సచ్చిదానందస్వామిజీ, మంత్రులు కొట్టు సత్యనారాయణ, బొత్స సత్యనారాయణ, టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి దంపతులు పాల్గొన్నారు.రాష్ట్ర ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్య, అష్ట ఐశ్వర్యాలతో వర్థిల్లాలని, రాష్ట్రం సమగ్రాభివృద్ధి చెందాలని సిఎం వైఎస్ జగన్ వేదపండితుల మంత్రోచ్చారణతో కూడిన సంకల్పం తీసుకొని ఆరు రోజుల క్రితం ఈ మహాయజ్ఞాన్ని ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఇది బుధవారం పండితులు నిర్ణయించిన ముహూర్తాన తిరిగి సిఎం జగన్ చేతుల మీదుగానే అఖండ పూర్ణాహుతితో కార్యక్రమం ముగిసింది. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరుగుతున్న అష్టోత్తర శత కుండాత్మక చండీ రుద్ర రాజశ్యామల సుదర్శన సహిత శ్రీ మహాలక్ష్మి యజ్ఞం మహా పూర్ణాహుతి కార్యక్రమం అత్యంత వైభవంగా సాగింది. ముఖ్యమంత్రి శ్రీ వైయస్.జగన్.సీఎం శ్రీ వైయస్.జగన్‌కు శేష వస్త్రం అందజేసి.. వేదాశీర్వచనాలతో స్వాగతం పలికిన వేదపండితులు, ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, దేవాదాయశాఖ కమిషనర్ శ్రీరాము సత్యనారాయణ. అభిషేక మండపంలో



# అక్రమ మద్యం వాడితే కఠిన చర్యలు

(మొదటి పేజీ తరువాయి) అయితే, మద్యం విషయంలో మాత్రం ద్రవ్యోల్బణం గురించి అసలు పట్టించుకోలేదు. గత ఆర్థిక సంవత్సరంలో (2022-23), అనేక ఆహార పదార్థాల ధరలతో పాటు ఆల్కహాల్ రేట్లు కూడా పెరిగినా, మద్యం ప్రియులను అది ప్రభావితం చేయలేదు. మందుబాబులు ఎక్కువ డబ్బు చెల్లించి మరీ బాటిళ్లు కొన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో భారతదేశంలో ప్రజలు దాదాపు 400 మిలియన్ కేసుల మద్యాన్ని కొనుగోలు చేశారని ఎకనమిక్ టైమ్స్ తన రిపోర్ట్‌లో రాసింది. సగటున తీసుకుంటే, 2022-23 ఆర్థిక సంవత్సరంలో, మద్యం ప్రియులు 4.75 బిలియన్ల 750 ప బాటిళ్లను కొనుగోలు చేశారు. విస్కీ అయినా, రమ్ అయినా, బ్రాందీ అయినా, జిన్ అయినా, ఓడ్కా అయినా... అన్ని రకాల మద్యం విరివిగా అమ్ముడైందని విక్రయాల లెక్కలు చెబుతున్నాయి. వీటితో పాటు ప్రీమియం బ్రాండ్స్, అంటే అధిక ధరల మద్యం విక్రయాలు కూడా ఎక్కువగానే జరిగాయి. ణాంకాల ప్రకారం, 2022 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2023 మార్చి 31వ తేదీ వరకు, దేశవ్యాప్తంగా 39.5 కోట్ల మద్యం కేసుల విక్రయాలు నమోదయ్యాయి, ఏడాది క్రితం ఇదే కాలంతో పోలిస్తే ఇది 12 శాతం ఎక్కువ. 2018-19లో దేశవ్యాప్తంగా దాదాపు 35 కోట్ల మద్యం కేసులు అమ్ముడయ్యాయి. ఆ మద్యం అమ్మకాల రికార్డు 4 సంవత్సరాల తర్వాత బద్దలైంది.

# తెలంగాణ అవతరణోత్సవాలు



సిఎస్ శాంతికుమారి అధ్యక్షతన కమిటీ

**హైదరాబాద్,మే17(సమసమాజం):** తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అధ్యక్షతన రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ కమిటీలో సభ్యులుగా ప్రభుత్వ సలహాదారు కేవీ రమణ, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, వివిధ శాఖల ఉన్నతాధికారులు కొనసాగ నున్నారు. దశాబ్ది ఉత్సవాల కమిటీ కన్వీనర్‌గా సమాచారశాఖ స్పెషల్ కమిషనర్ వ్యవహరించ నున్నారు.పోరాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్న తొమ్మిదేండ్ల అనతికాలంలోనే దేశానికే ఆదర్శంగా పాలన కొనసాగిస్తూ, పదవ వసంతంలోకి అడుగిడుతున్న చారిత్రక సందర్భంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను అత్యంత వైభవోపేతంగా, ఘనంగా జరుపుకోవాలని ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ ఉత్సవాలు తెలంగాణ సమాజ ఆకాంక్షలకు అనుగుణంగా, తెలంగాణ ఘనకీర్తి దశ దిశలా చాటేలా, ప్రతి హృదయం ఉప్పొంగేలా పండుగ వాతావరణంలో నిర్వహించాలని సీఎం సూచించారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్ర రాజధాని హైద్రాబాద్ వరకు, రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 2వ తేదీ నుంచి 21 రోజుల పాటు ఈ ఉత్సవాలు నిర్వహించాలని సూచించారు.

# కర్నాటక సిఎం పదవిపై వీడని ఉత్కంఠ

(మొదటి పేజీ తరువాయి)మిడియాతోపాటు కర్ణాటక కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నేతలు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. సిద్ధరామయ్యే ముఖ్యమంత్రి అని.. మే 18వ తేదీన బెంగళూరులో సీఎల్పీ భేటీ ఉంటుందని.. ఆ వెంటనే కంఠీవ స్టేడియంలో ప్రమాణ స్వీకారం అనే వార్తలు వచ్చాయి. సిద్ధరామయ్య మద్దతు దారులు, కాంగ్రెస్ కార్యకర్తలు స్వీట్లు పంచుకుని.. బాణాసంచా కాల్చారు. సిద్ధరామయ్య ఇంటి దగ్గర భారీగా పోలీసులు మోహరించారు. సెక్యూరిటీ పెంచారు. ఈ పరిణామాలు అన్నీ కూడా సిద్ధరామయ్య సీఎం అని డిసైడ్ చేశాయి. అనూహ్య పరిణామాల మధ్య.. ఈ వార్తలు వచ్చిన మూడు గంటల సమయం తర్వాత.. తీరిగ్గా స్పందించారు కాంగ్రెస్ పార్టీ ఏఐసీసీ ప్రతినిధి సూర్జేవాలా. కర్ణాటక సీఎం అభ్యర్థిని ఇంకా ప్రకటించ లేదంటూ కామెంట్ చేశారు. దీంతో కథ మొదటికి రావటం ఏంటో కానీ.. అందరూ గందరగోళంలో పడ్డారు.

# భూమా అఖిలప్రియకు రిమాండ్

**నంద్యాల,మే17(సమసమాజం):** మాజీమంత్రి భూమా అఖిలప్రియకు న్యాయ మూర్తి రిమాండ్ విధించారు. అఖిల ప్రియతో పాటు ఆమె భర్త భార్గవ్‌రామ్‌కు 14 రోజుల రిమాండ్ విధించారు. వీరిద్దరితో పాటు మరో ఇద్దరికి కూడా 14 రోజుల రిమాండ్ విధించారు. నంద్యాల నుంచి అఖిలప్రియ దంపతులను కర్నూలు జైలుకు తరలించారు. బుధవారం ఉదయం భూమా అఖిలప్రియను పోలీసులు అరెస్టు చేశారు. గతరాత్రి నంద్యాల మండలం కొత్తపల్లి దగ్గర యువనేత నారా లోకేష్ యువగళం పాదయాత్రలో టీడీపీ నేత ఏవీ సుబ్బారెడ్డి అఖిల ప్రియ మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలోనే అఖిల ప్రియ అనుచరులు ఏవీ సుబ్బారెడ్డిపై దాడిచేశారు. ఈ ఘటనలో సుబ్బారెడ్డి స్వల్పంగా గాయపడ్డారు. దీంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు.



అఖిలప్రియపై నంద్యాల పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. భూమా అఖిలప్రియ అరెస్ట్‌తో ఆళ్లగడ్డలో టెన్షన్ వాతావరణం నెలకొంది.

# ఇప్పటికిప్పడు ఎన్నికలు పెడితే 105 సీట్లు

(మొదటి పేజీ తరువాయి) విస్తృతస్థాయి సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా కేసీఆర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు వస్తే బీఆర్ఎస్‌కు 105 సీట్లు వస్తాయని ఆయన జోస్యం చెప్పారు. కర్ణాటక ఎన్నికల ఫలితాలపై స్పందిస్తూ... కర్ణాటక ఫలితాలను పట్టించుకోవద్దని కేడర్‌కు సూచించారు. అక్కడ ఎవరు గెలిచినా ప్రజలకు ఒరిగేది ఏమీ లేదని కేసీఆర్ వ్యాఖ్యానించారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని, ఉద్యమ కార్యాచరణను రూపొందించాలని కేసీఆర్ దిశానిర్దేశం చేసినట్లు తెలుస్తోంది. 9 ఏళ్లలో ఏం చేశామో ప్రజలకు చెప్పాలని బీఆర్ఎస్ శ్రేణులకు కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. రైతులను చెరువుల దగ్గరకు పిలిచి మీటింగ్‌లు పెట్టాలని, చెరువుగట్ల మీద రైతులతో కలిసి భోజనం చేయాలని బీఆర్ఎస్ నాయకులకు పిలుపునిచ్చారు. 70 ఏళ్లలో కాంగ్రెస్ చేసిందేమీ లేదని, వాళ్లను ప్రజలు నమ్మరని తెలిపారు. మంత్రులు జిల్లాల్లో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను పర్యవేక్షించాలని ఆదేశించారు. సమావేశానంతరం మాట్లాడిన రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్ రెడ్డి .. తెలంగాణలో శతాబ్ద కాలంలో చేయాల్సిన పనులను దశాబ్ద కాలంలోనే బీఆర్ఎస్ ప్రభుత్వం చేసి చూపించిందని పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్ అధ్యక్షతన జరిగిన బీఆర్ఎస్ శాసనసభాపక్ష, పార్లమెంటరీ పార్టీ సమావేశం ముగిసిన అనంతరం మంత్రి జగదీశ్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. ÷లంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల నిర్వహణతో పాటు పలు కీలక అంశాలపై పార్టీ నేతలకు కేసీఆర్ దిశానిర్దేశర చేసినట్లు మంత్రి పేర్కొన్నారు. దేశంలో ఇప్పటి వరకు ఏ పార్టీ చేయని అద్భుతాలు, విజయాలను ఈ పదేండ్ల కాలంలోనే బీఆర్ఎస్ పార్టీ సాధించిందని తెలిపారు. ఇప్పటి వరకు చేసిన పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కేసీఆర్ సూచించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం సాధించిన విజయాలను పార్టీ పరంగా కార్యకర్తల ద్వారా ప్రజలకు వివరించాలి. అనేక రంగాల్లో అద్భుతమైన విజయాలు సాధించిన ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వం అని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై కేంద్ర మంత్రులతో పాటు ఇతర రాష్ట్రాల ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రశంసలు కురిపించారని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో మన పార్టీ విజయాలను తప్పకుండా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు మంత్రి జగదీశ్ రెడ్డి. విద్యుత్ రంగంలో గుజరాత్‌లో ఇవాళ్టికి కోతలు ఉన్నాయి. ఉచిత విద్యుత్ ఇవ్వడం లేదు. దేశంలోనే తొలిసారిగా రైతాంగానికి 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను తెలంగాణ ప్రభుత్వం ఇస్తుందన్నారు. నీటి విషయంలో మన రాష్ట్రంలో భూగర్భ జలాలు ఉబికి వస్తున్నాయి. కొన్ని రాష్ట్రాల్లో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. వ్యవసాయ రంగంలో దేశమంతా ఇబ్బంది పడుతుంటే.. తెలంగాణలో మాత్రం వ్యవసాయాన్ని పండుగలా మార్చాం. సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి.. ప్రతి ఒక్కరికి చేరువయ్యాం. దేశంలోని పలు రాష్ట్రాల ప్రజలు పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఉంది. కానీ తెలంగాణలో ఏ ఒక్కరూ కూడా ఆకలితో బాదపడటం లేదు. అందరి ఆకలి తీర్చాం. దశాబ్ద కాలంలోనే శతాబ్ద కాలంలో చేయాల్సిన పనులు చేసి చూపించాం. ఈ విషయాలన్నింటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కేసీఆర్ సూచించినట్లు మంత్రి జగదీశ్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశానికి బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, వివిధ కార్పోరేషన్‌ల ఛైర్మన్‌లు హాజరయ్యారు.

# వీడని కర్నాటక పీఠముడి

- ఇరు నేతలతో కాంగ్రెస్ అగ్రనేతల చర్చలు
- రాహుల్,ఖర్గేలతో డికె సుదీర్ఘ చర్చ
- సిద్దరమాయ్యను సిఎం చేస్తే ఒప్పుకోను
- ఖర్గేను చేస్తే సమ్మతమే : డెకె వెల్లడించినట్లు సమాచారం



**న్యూఢిల్లీ,మే17(సమసమాజం):** కర్ణాటకకు కాబోయే ముఖ్యమంత్రి ఎంపికపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఇద్దరి మధ్య డికె శివకుమార్ కొత్త ప్రతిపాదన తీసుకుని వచ్చినట్లు సమాచారం. మల్లి కార్జునఖర్గేను సిఎం చేస్తే తనకు అభ్యంతరం లేదని రాహుల్‌తో స్పష్టం చేసినట్లు సమాచారం. సిద్దరామయ్యను సిఎంగా చేస్తే అంగీకరించేది లేదని కూడా కుండబద్దలు కొట్టినట్లు సమాచారం. ఇదిలావుంటే కర్ణాటక సీఎం పోస్టు కోసం రేసులో కర్ణాటక కాంగ్రెస్ చీఫ్ డీకే శివకుమార్, మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ కీలక నేత సిద్ధరామయ్య పోటీ పడుతున్నారు. కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో ఇద్దరూ ఎడతెగని భేటీలతో ఉత్కంఠను మరింత పెంచుతుండటం గమనార్హం. కాంగ్రెస్ అధిష్టానం సిద్ధరామయ్యను ముఖ్యమంత్రిగా నిర్ణయించిందని.. గురువారం సాయంత్రం కంఠీరవ స్టేడియంలో ఆయన ప్రమాణ స్వీకారం చేయనున్నారని జాతీయ మీడియాలో వార్తలు గుప్పుమన్నాయి. ఈ వార్తల్లో ఎలాంటి నిజం లేదని, ఇంకా అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని కర్ణాటక కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ రణ్‌దీప్ సూర్జేవాలా కుండబద్ధలు కొట్టడంతో సిఎం ఎవరన్నది తేలలేదని స్పష్టమైంది. ఈ క్రమంలో.. డీకే శివకుమార్ కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు, తన గురువు అయిన మల్లికార్జున ఖర్గేతో భేటీ అయి చర్చించారు. ఈ భేటీ దాదాపు 2 గంటలకు పైగా సుదీర్ఘంగా సాగింది. అంతకు మునుపు రాహుల్ గాంధీతో కూడా చర్చించిన డీకే అధిష్టానం ముందు అనూహ్య ప్రతిపాదన తీసుకొచ్చారు. తనకు ముఖ్యమంత్రి పదవి ఇవ్వలేకపోతే మల్లికార్జున ఖర్గేకు ఇవ్వాలని రాహుల్ గాంధీ ముందు డీకే



స్పష్టం చేసినట్లు సమాచారం. డీకే శివకుమార్ చేసిన ఈ ప్రతిపాదనతో ఒక విషయం మాత్రం స్పష్టమైంది. ఎట్టి పరిస్థితుల్లో సిద్ధరామయ్యను ముఖ్యమంత్రిగా అంగీకరించనని డీకే శివకుమార్ స్పష్టం చేసినట్లు సమాచారం. పవర్ షేరింగ్ ఫార్ములాకు కూడా డీకే సిద్ధంగా లేరు. తనకు ఇవ్వని పక్షంలో మల్లికార్జున ఖర్గేకు అవకాశం ఇవ్వాలే కానీ సిద్ధరామయ్యను సీఎంను చేస్తే మాత్రం సహించేది లేదని డీకే పరోక్షంగా రాహుల్‌కు ఈ ప్రతిపాదనతో చెప్పినట్టయింది. ఇదిలా ఉండగా ముఖ్యమంత్రి పదవి కోసం జరుగుతున్న ఈ పోరులో డీకే శివకుమార్ వేగంగా పావులు కదుపుతున్నారు. కేపీసీసీ ప్రెసిడెంట్ డీకే శివకుమార్ తన మద్దతుదారులతో కలిసి ఢిల్లీలోని తన సోదరుడు, కాంగ్రెస్ ఎంపీ డీకే సురేశ్ నివాసంలో సమావేశం నిర్వహించారు. 'ఏం చేద్దాం..? కిం కర్తవ్యం ఏంటి'..? అనే విషయాలపై డీకే శివకుమార్ తనకు మద్దతు తెలిపిన ఎమ్మెల్యేలతో చర్చించడం గమనార్హం. ఈ సమావేశం తాలూకా ఫొటోలు కూడా బయటికొచ్చాయి. డీకే ఆధ్వర్యంలో జరిగిన ఈ కీలక సమావేశంలో మగడి బాలకృష్ణ, బేలూరు గోపాలకృష్ణ, కునిగల్ రంగనాథ్, ఇక్బాల్ హుస్సేన్.. ఎమ్మెల్యేలు శ్రీనివాస్, వీరేంద్ర పప్పి తదితరులు పాల్గొన్నారు.

# దళితుడైన ఖర్గేను సిఎం చేయాలి

## కర్నాటకలో కార్యకర్తల నినాదాలు



**బెంగళూర,మే17(సమసమాజం):** కర్ణాటక సీఎం రేసులో ఇప్పటి వరకూ డీకే శివకుమార్, సిద్దరామయ్య పేర్లు మాత్రమే వినిపించాయి. కానీ...ఇప్పుడు మల్లికార్జున్ ఖర్గే పేరు తెరపైకి వచ్చింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేని కూడా ఈ రేసులోకి లాగారు కొందరు కార్యకర్తలు బెంగళూరులోని పార్టీ ఆఫీస్ బయట కొందరు ఖర్గేకి మద్దతుగా నినాదాలు చేశారు. మల్లికార్జున్ ఖర్గేనే ముఖ్యమంత్రిగా ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. 'ఇప్పటి వరకూ కర్ణాటకలో ఓ దళితుడు ముఖ్యమంత్రి అవ్వలేదు. అందుకే ఖర్గేకు ఆ అవకాశమివ్వాలి' అంటూ తమ వాదనలు వినిపించారు. ఓ వైపు ఖర్గే, రాహుల్‌తో డీకే శివకుమార్, సిద్దరామయ్య వరుస భేటీలతో బిజీబిజీగా ఉండగా...వీళ్లు కొత్త డిమాండ్ తెరపైకి తీసుకొచ్చారు. ఇప్పటికే...సీఎం ఎవరన్నది ఓ క్లారిటీ వచ్చినట్టే ఉంది. సిద్దరామయ్యకే హైకమాండ్ మొగ్గు చూపుతున్నట్టు విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. డీకే శివకుమార్‌కి డిప్యూటీ సీఎంతో పాటు మరి కొన్ని కీలక శాఖలు కట్టబెట్టే అవకాశాలున్నాయి. అయితే...ఇవన్నీ ఊహాగానాలేనా..? లేదా నిజంగానే హైకమాండ్ నిర్ణయం తీసుకుందా అన్నది అధికారికంగా ప్రకటన వచ్చేంత వరకూ ఏమీ చెప్పలేం. ప్రస్తుతం ఉన్న సమాచారం ప్రకారం..డీకే శివ కుమార్‌తో సోనియా గాంధీ భేటీ అయినట్టు తెలుస్తోంది. సీఎం పదవిని ఇవ్వకపోవడానికి కారణాలేంటో ఆమె వివరించారట. అంతే కాదు. ఆయనను కన్విన్స్ చేయడంతో పాటు పార్టీ కోసం పడిన కష్టానికి తగ్గ ప్రతిఫలం ఉంటుందని భరోసా ఇచ్చినట్టూ విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి.

# ఇస్రో మరో అంతరిక్ష ప్రయోగం

## 29న మరో రాకెట్ ప్రయోగానికి సిద్ధం

**బెంగళూరు,మే17(సమసమాజం):** మరో నావిగేషన్ ఉపగ్రహ ప్రయోగానికి భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో సన్నాహాలు చేస్తోంది. శ్రీహరికోటలోని భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రం సతీష్ థావన్ స్పేస్ సెంటర్ షార్ నుంచి ఈ నెల 29న జీఎస్ఎల్వీ-మార్క్ 2 రాకెట్ ఎన్‌వీఎస్-01 నావిగేషన్ ఉపగ్రహాన్ని రోదసీలోకి పంపనున్నారు. షార్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి జరిగే ఈ రాకెట్ అనుసంధాన పనులను శాస్త్రవేత్తలు శరవేగంగా చేస్తున్నారు. శ్రీహరికోటలోని భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రం సతీష్ థావన్ స్పేస్ సెంటర్ షార్ నుంచి ఈ నెల 29న జీఎస్ఎల్వీ-మార్క్ 2 రాకెట్ ఎన్‌వీఎస్-01 నావిగేషన్ ఉపగ్రహాన్ని రోదసీలోకి పంపనున్నారు. షార్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి జరిగే ఈ రాకెట్ అనుసంధాన పనులను శాస్త్రవేత్తలు శరవేగంగా చేస్తున్నారు. 2016 ఏప్రిల్ 28న పీఎస్ఎల్వీ-సీ 35 రాకెట్ ద్వారా ప్రయోగించిన ఐఆర్‌ఎన్‌ఎస్‌ఎస్-1జీ ఉపగ్రహ కాల పరిమితి ముగిసిపోవడంతో దాని స్థానంలో ఇస్రో ఈ ఉపగ్రహాన్ని పంపనుంది. దేశంలో సొంత నావిగేషన్ వ్యవస్థకు ఇస్రో శ్రీకారం చుడుతోంది. ఇందులో భాగంగానే ఇస్రో ఎన్‌వీఎస్-01 ఉపగ్రహాన్ని ప్రయోగించేందుకు సన్నద్ధమవుతోంది. ఇది విజయవంతమైతే 12 సంవత్సరాల పాటు సేవలందించనుంది. దేశంలోని పొజిషనింగ్, నావిగేషన్, టైమింగ్ అవసరాలను తీర్చడానికి నావిగేషన్ విత్ ఇండియన్ కన్సల్టేషన్ (నావిక్)ను ఇస్రో ఏర్పాటు చేస్తోంది. ఏప్రిల్‌లో ప్రయోగించిన పీఎస్ఎల్వీ-సీ 55 రాకెట్ విజయవంతం కావడంతో అదే ఉత్సాహంతో శాస్త్రవేత్తలు నావిక్ ఉపగ్రహ ప్రయోగం చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. నావిక్ ప్రయోగం అయిన వెంటనే చంద్రయాన్-3 (అఠజీనిటసజాజీజీని-3) ప్రయోగం కూడా జూన్ మాసంలో నిర్వహించేందుకు ఇస్రో సన్నద్ధమవుతోంది.



# కారు గుర్తును పోలిన గుర్తుల తొలగింపు

### బిఆర్‌ఎస్ వినతి మేరకు ఇసి నిర్ణయం

**న్యూఢిల్లీ,మే17(సమసమాజం):** బీఆర్‌ఎస్ పార్టీ గుర్తు కారుతో పోలి ఉన్న ఆటో రిక్షా, ట్రక్, టోపీ, ఇస్త్రీ పెట్టె గుర్తులను ఎన్నికల కమిషన్ తొలగించింది. ఈ గుర్తులు ఇకనుంచి ఎలాంటి ఎన్నికల్లో ఉపయోగించమని స్పష్టం చేసింది. బీఆర్‌ఎస్ పార్టీ విజ్ఞప్తి మేరకు ఎలక్షన్ కమిషన్ ఈ కీలక నిర్ణయం తీసుకుంది. గతంలో జరిగిన దుబ్బాక, హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థులకు ఈ గుర్తులను కేటాయించింది. దీంతో ఓటర్లు గందరగోళానికి గురై.. కారు గుర్తుకు బదులు వేరే గుర్తులకు ఓటు వేసినట్లు గతంలో పెద్ద చర్చ జరిగింది. కారు గుర్తును పోలిన గుర్తులను తొలగించాలని మునుగోడు ఉప ఎన్నికల సమయంలో బీఆర్‌ఎస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్ రాజ్‌ను కలిసింది. ఎన్నికల్లో కారును పోలిన గుర్తులు 8 ఉన్నాయని, వాటిని ఫ్రీ సింబల్స్ జాబితా నుంచి తొలగించాలని కోరింది. అప్పట్లో బీఆర్‌ఎస్ ప్రతినిధి బృందం వికాస్ రాజ్‌కు ఓ వినతి పత్రాన్ని కూడా సమర్పించింది. మరోవైపు దేశవ్యాప్తంగా 26 రాష్ట్రాల్లో గుర్తింపు పొందిన రాష్ట్ర పార్టీల వివరాలను కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. దీని ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో రెండు, తెలంగాణలో నాలుగు పార్టీలకు ఈ గుర్తింపు లభించింది. ఆంధ్రప్రదేశ్‌లో గుర్తింపు పొందిన వాటిలో యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ (వైసీపీ), తెలుగుదేశం పార్టీలున్నాయి. తెలంగాణలో ఎంఐఎం, బీఆర్‌ఎస్‌తో పాటు తెలుగుదేశం, యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ (వైఎస్సార్టీపీ ) పార్టీలు రాష్ట్ర పార్టీ హోదా పొందినట్లు వెల్లడించింది. తెలుగు రాష్ట్రాల్లో గుర్తింపు పొందిన పార్టీలకు ప్రస్తుతం కేటాయించిన గుర్తులను ఆ రాష్ట్రాల్లో రిజర్వు చేయనున్నట్లు ఎన్నికల సంఘం పేర్కొంది. ఈ నాలుగు పార్టీల చిరునామాలు హైదరాబాద్ కేంద్రంగానే ఉన్నాయి. వీటికి అతీతంగా కేంద్ర ఎన్నికల సంఘం 193 ఫ్రీసింబల్స్‌ను విడుదల చేసింది. ఆటోరిక్షా, హ్యాట్, ఇస్త్రీపె÷-టటె, ట్రక్కు గుర్తులను మాత్రం ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో ఇవ్వడం లేదని ఈసీ పేర్కొంది. ఇవి కారు గుర్తును పోలి ఉండటంతో వాటిని తెలుగు రాష్ట్రాల జాబితా నుంచి మినహాయించింది. జాతీయ పార్టీల జాబితాలో ఆప్, బీఎస్పీ, బీజేపీ, సీపీఐ(ఎం), కాంగ్రెస్, నేషనల్ పీపుల్స్ పార్టీలు ఉన్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది.

# ఎసిబికి చిక్కిన అవినీతి ఉద్యోగి

## జూనియర్ లైన్‌మెన్ పట్టివేత

**రంగారెడ్డి,మే17(సమసమాజం):** జిల్లా మరో అవినీతి అధికారి ఏసీబీ వలకు చిక్కాడు. చేవెళ్ళ నియోజకవర్గం లోని మొయినాబాద్ సబ్ స్టేషన్ లో పనిచేసే జూనియర్ లైన్ మెన్ లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు.వీరకర్ణ అనే వ్యక్తి నాగిరెడ్డి గూడ, బాకారం ఏరియాలో జూనియర్ లైన్ మెన్ గా పనిచేస్తున్నాడు. అయితే బాకారం గ్రామంలో హైదరాబాద్ కు చెందిన ప్రతాప్ అనే వ్యక్తి రెండు ఎకరాల పొలాన్ని తీసుకున్నాడు. ఆ పొలంలో మీటర్ బిగించడానికి ప్రతాప్ వీరకర్ణకు రూ. 10 వేలు లంచం ఇస్తానని ఒప్పుకున్నాడు.మీటర్ బిగించే సమయంలో మరో 5 వేలు ఇవ్వాలని వీరకర్ణ డిమాండ్ చేశాడు. ఆ తర్వాత మరో రూ. 5 వేలు ఇచ్చాడు. అయితే రూ. 10 వేలు ఇచ్చిన తర్వాత కూడా వీర కర్ణ మరిన్ని డబ్బులు కావాలని డిమాండ్ చేయడంతో విసిగిపోయిన బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఏసీబీ డీఎస్పీ సూర్యనారాయణ తోపాటు తమ సిబ్బంది ఆధ్వర్యంలో వీరకర్ణ లంచం తీసుకుంటుండగా.. రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. జూనియర్ లైన్ మెన్ పై కేసు నమోదు చేశారు.

# శివకుమార్‌కు సుప్రీంకోర్టులో తాత్కాలిక ఊరట

## సిబిఐ పిటిషన్పై జూలై 14కు విచారణ వాయిదా



**న్యూఢిల్లీ,మే17(సమసమాజం):** కర్ణాటక పీసీసీ చీఫ్ డీకే శివకుమార్‌కు సుప్రీంకోర్టులో తాత్కాలిక ఊరట లభించింది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసు విచారణపై మధ్యంతర స్టే మంజూరు చేస్తూ కర్ణాటక హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది. అయితే దీనిని సవాలు చేస్తూ సీబీఐ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు జూలై 14కి వాయిదా వేసింది. ఈ కేసుకు సంబంధించి మే 23న కర్ణాటక హైకోర్టులో విచారణ జరగనున్నట్లుగా డీకే శివకుమార్ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వెల్లడించారు. మనీలాండరింగ్ కేసులో విచారణ ఎదుర్కొంటోన్న డీకే శివకుమార్‌పై దర్యాప్తును ఆధారంగా చేసుకొని.. ఆదాయపు పన్ను శాఖ కూడా 2017లో ఆయన ఇంటిపై దాడులు చేసింది. అదే సమయంలో ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వాన్ని సీబీఐ పలుమార్లు అనుమతి కోరింది. దీంతో 2020లో డీకేఎస్‌పై అవినీతి నిరోధక చట్టం కింద సీబీఐ కేసు నమోదు చేసింది. ఇలా తనపై కేసు నమోదు చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతోపాటు తనపై జరుగుతోన్న దర్యాప్తును సవాలు చేస్తూ డీకే శివకుమార్ కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు. 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు సీబీఐ తనపై పదేపదే నోటీసులు జారీ చేస్తూ, తనపై మానసిక ఒత్తిడిని ప్రయోగిస్తోందని ఆరోపిస్తూ శివకుమార్ కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ఆయనపై సీబీఐ చేస్తున్న దర్యాప్తుపై కర్ణాటక హైకోర్టు ఫిబ్రవరి 10వ తేదీన మధ్యంతర స్టే విధించింది. అనంతరం ఆ స్టేను పలుమార్లు పొడిగించింది. దీంతో కర్ణాటక హైకోర్టు ఉత్తర్వులను సుప్రీంకోర్టులో సీబీఐ సవాలు చేసింది.

# షార్ట్ సర్క్యూట్ తో రెండు ఇళ్లు దగ్ధం

**జగిత్యాల,మే17(సమసమాజం):** జిల్లాలో షార్ట్ సర్క్యూట్ తో రెండు ఇళ్లు దగ్ధమయ్యాయి. బుగ్గారం మండలంలోని వెలుగొండ గ్రామంలో సెసరి అశోక్, సెసరి పాండుకు అనే ఇద్దరి వ్యక్తులకు చెందిన రెండు ఇళ్లు మంటల్లో కాలి బూడిదైపోయాయి. అయితే ఇంట్లో ఎవరు లేని సమయంలో ఈ ప్రమాదం జరగడంతో పెను ప్రమాదం తప్పింది. పట్టపగలు ఒక్కసారిగా రెండు ఇండ్లలో నుంచి మంటలు రావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే ్గ÷ర్ ఇంజన్ కు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ్గ÷ర్ సిబ్బంది మంటలను ఆర్పేశారు. షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగిందా.. లేకపోతే ఇంకేదైనా కారణం ఉంటుందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



# మరో ఆడపిల్లకు తండ్రయిన అంబటి

### కూతుళ్ల ప్రేమను పొందడం అదృష్టమంటూ ఎమోషనల్ పోస్ట్



**విజయవాడ,మే17(సమసమాజం):** టీమిండియా మాజీ ఆటగాడు...చెన్నై సూపర్ కింగ్స్ బ్యాట్స్‌మన్ అంబటి రాయుడు మరోసారి తండ్రయ్యాడు. రాయుడు దంపతులకు రెండో ఆడపిల్ల పుట్టింది. తనకు కూతురు పుట్టిన విషయాన్ని అంబటి రాయుడు సోషల్ మీడియాలో తెలియజేశాడు. కూతురు ఫోటోను షేర్ చేశాడు. ఈ సందర్భంగా ఎమోషనల్ పోస్ట్ పెట్టాడు. తనకు కూతురు పుట్టడం పట్ల అంబటి రాయుడు సంతోషం వ్యక్తం చేశాడు. కూతుళ్లు తండ్రులకు దక్కే ఆశీర్వాదాలు అంటూ ఎమోషనల్ పోస్ట్ పెట్టాడు. ఇక అంబటి రాయుడు తన స్నేహితురాలు చెన్నుపల్లి విద్యను 2009 ఫిబ్రవరి 14 న వివాహం చేసుకున్నాడు. 2020లో అంబటి రాయుడు చెన్నుపల్లి విద్య దంపతులకు 2020లో మొదటి ఆడపిల్ల జన్మించింది. ప్రస్తుతం చెన్నుపల్లి విద్య రెండోబిడ్డకు జన్మనిచ్చింది. అంబటి రాయుడుకు చెన్నై సూపర్ కింగ్స్ జట్టు యాజమాన్యం శు భాకాంక్షలు తెలిపింది. సూపర్ డ్యాడ్‌కు రెట్టింపు ఆనందం ..రాయుడు..అతని కుటుంబ సభ్యులకు శు భాకాంక్షలు అని పేర్కొంది. ఈ మేరకు తన అధికారిక సోషల్ మీడియాలో షేర్ చేసింది. పీఎల్ 2023లో అంబటి రాయుడు అంతంతమాత్రంగానే రాణిస్తున్నాడు. ఇప్పటి వరకు ఒక్క కీలక ఇన్నింగ్స్ కూడా ఆడలేదు. ఇప్పటి వరకు 12 మ్యాచులు ఆడిన రాయుడు..కేవలం 122 పరుగులే చేశాడు. అతని స్ట్రైక్ రేటు కూడా 127 మాత్రమే ఉండటం గమనార్హం.

# నేరుగా ప్లే ఆఫ్‌కు గుజరాత్ టైటాన్స్

### ముంబై ఓటమితో మారిన ప్లే ఆఫ్ దశ





**ముంబై,మే17(సమసమాజం):** ఐపీఎల్ 2023 సీజన్ ప్లే ఆఫ్స్ దశకు చేరుకుంది. ఒకటి రెండు జట్లు మినహా మిగతా టీమ్స్‌కు లీగ్ దశలో చివరి మ్యాచ్ మాత్రమే మిగిలివుంది. అయినప్పటికీ ప్లే ఆఫ్స్ ఆడబోయే జట్లపై క్లారిటీ లేదు. ఒక్క గుజరాత్ టైటాన్స్ మాత్రమే ఇప్పటివరకు అఫీషియల్‌గా నాకౌట్ దశలో అడుగుపెట్టింది. సన్‌రైజర్స్ హైదరాబాద్, ఢిల్లీ క్యాపిటల్స్ ఇప్పటికే నిష్క్రమించగా... మిగతా 3 స్థానాల కోసం ఏకంగా 7 జట్లు పోటీలో నిలిచాయి. దీంతో టాప్-4లో చోటుదక్కించుకునే జట్లపై ఉత్కంఠ నెలకొంది. మరి ప్లే ఆఫ్ అవకాశాలు ఏ జట్టుకి ఏవిధంగా ఉన్నాయన్నది చివరిదశకు చేరుంది. మంగళవారం రాత్రి ముంబై ఇండియన్స్‌పై ఉత్కంఠ భరిత విజయాన్ని సాధించిన లక్నో సూపర్ జెయింట్స్ తన ప్లే ఆఫ్స్‌లో చోటుకు మరింత దగ్గరైంది. ఒకవేళ ఈ మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ గెలిచివుంటే నేరుగా క్వాలిఫై అయ్యుండేది. కానీ లక్నో గెలవడంతో ప్లే ఆఫ్స్ రేసు మరింత సంక్లిష్టంగా మారింది. లక్నో సూపర్ జెయింట్స్ తన చివరి మ్యాచ్‌లో గెలిస్తే 17 పాయింట్లతో ప్లే ఆఫ్స్‌కు నేరుగా అర్హత సాధిస్తుంది. ఒకవేళ ఓడిపోతే మాత్రం సంక్లిష్ట పరిస్థితి ఏర్పడుతుంది. చెన్నై సూపర్ కింగ్స్ , ముంబై ఇండియన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు , పంజాబ్ కింగ్స్ జట్లు 16 లేదా అంతకంటే ఎక్కువ పాయింట్లతో ప్లే ఆఫ్ రేసులో నిలిచే అవకాశాలున్నాయి. లక్నో ప్రస్తుతమున్న 15 పాయింట్లతో కూడా అర్హత సాధించే ఛాన్స్ ఉంటుంది. కానీ పోటీలో ఉన్న జట్లు 16 లేదా అంతకంటే ఎక్కువ పాయింట్లతో ఉండకూడదు. ఐదుసార్లు ఛాంపియన్ అయిన ముంబై ఇండియన్స్ ప్రస్తుతం 14 పాయింట్లతో టేబుల్‌లో టాప్-4 జట్టుగా ఉంది. తదుపరి మ్యాచ్ గెలిస్తే 16 పాయింట్లతో క్వాలిఫై అవుతుంది. అయితే రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, చెన్నై సూపర్ కింగ్స్, పంజాబ్ కింగ్స్, లక్నో సూపర్ జెయింట్స్ కూడా 16 లేదా అంతకంటే ఎక్కువ పాయింట్లతో ముంబైతో పోటీపడే అవకాశం ఉంటుంది. అలాంటి సందర్భంలో నెట్ రన్‌రేట్ అత్యంత కీలకమవనుంది. ఒకవేళ చివరి మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ ఓడిపోతే మాత్రం మొత్తం 5 జట్లు 14 పాయింట్లతో ఉంటాయి. ఈ సమీకరణంలో ప్లే ఆఫ్ అవకాశాలు సంక్లిష్టమవడం ఖాయం. చెన్నై సూపర్ కింగ్స్ ప్రస్తుతం 15 పాయింట్లతో ఉంది. ఒకవేళ మిగిలివున్న ఢిల్లీపై మ్యాచ్‌లో గెలిస్తే నేరుగా అర్హత సాధిస్తుంది. అంతేకాదు టాప్-2లో చోటు దక్కించుకునే అవకాశమూ ఉంటుంది. దురదృష్టవశాత్తూ ఓడిపోతే మాత్రం 16 పాయింట్లతో నిలిచే జట్లతో ప్లే ఆఫ్ అవకాశాలకు ప్రమాదం పొంచివుంటుంది. గత మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్‌పై ఘనవిజయాన్ని సాధించిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ప్రస్తుత నెట్ రన్‌రేట్ 0.166కి మెరుగుపడింది. ఇక మిగిలివున్న చివరి 2 మ్యాచుల్లో గెలిస్తే ఎలాంటి ఢోకా లేకుండా ప్లే ఆఫ్స్‌కి చేరుకుంటుంది. ఒక్క మ్యాచ్‌లో ఓడిపోయినా ఆశలు గల్లంతే అవుతాయి. పంజాబ్ కింగ్స్ ప్రస్తుత ఐపీఎల్ సీజన్‌లో టాప్-4లో చోటు దక్కించుకోవాలంటే మిగిలిన 2 మ్యాచుల్లోనూ గెలవాల్సి ఉంటుంది. అప్పుడు 16 పాయింట్లతో సమానంగా ఉన్న జట్లతో నెట్ రన్ రేట్ విషయంలో పోటీపడితే అవకాశం లభిస్తుంది. ప్రస్తుతం ఆ జట్టు రన్ రేట్ మైనస్ 0.268గా ఉంది. కాబట్టి మిగిలిన రెండు మ్యాచుల్లో ఒక దాంట్లో ఓడినా ప్లే ఆఫ్స్ రేసు నుంచి ఔట్ అవుతుంది. ఈ సీజన్‌ను అద్భుతంగా ఆరంభించిన రాజస్థాన్ రాయల్స్ గత మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుపై అవమానకర రీతిలో ఓటమిపాలవ్వడంతో ప్లే ఆఫ్ అవకాశాలను సంక్లిష్టం చేసుకుంది. మొత్తం 5 జట్లు 14 పాయింట్లతో నిలిస్తే ప్లే ఆఫ్స్ రేసు సంక్లిష్టంగా మారుతుంది. అలా జరగాలంటే రాజస్థాన్ రాయల్స్ పంజాబ్ కింగ్స్‌పై గెలవాల్సి ఉంటుంది. కోల్‌కతా నైట్‌రైడర్స్ ప్రస్తుతం 12 పాయింట్లతో ఉంది. టీమ్ రన్‌రేట్ - 0.256గా ఉంది. కాబట్టి కేకేఆర్‌కు ప్లే ఆఫ్ అవకాశాలు దాదాపు కష్టమనే చెప్పాలి. ఒకవేళ తన తర్వాతి మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్‌ని భారీ తేడాతో ఓడించి 14 పాయింట్లతో నిలిస్తే ఇతర జట్ల ఫలితాలపై ప్లే ఆఫ్ అవకాశాలు ఆధారపడి ఉంటాయి. కాగా సన్‌రైజర్స్ హైదరాబాద్, ఢిల్లీ క్యాపిటల్స్ ప్లే ఆఫ్ రేసు నుంచి ఇప్పటికే ఔటయిన విషయం తెలిసిందే.






# స్పైన్ నుంచి తిరిగి వచ్చిన మహేశ్ బాబు

టాలీవుడ్ స్టార్ హీరో సూపర్ స్టార్ మహేష్ బాబు క్రేజ్ గురించి అందరికీ తెలిసిందే. అయితే ఆయన ఏం చేసిన వార్తగానే నిలుస్తుంది. షూటింగ్ లో ఏమాత్రం గ్యాప్ వచ్చినా ఆయన వెంటనే ఫ్యామిలీతో కలిసి వెకేషన్‌కు వెళ్లిపోతుంటారు. ప్రపంచంలోని అనే దేశాల్లో తిరుగుతూ ఫుల్లుగా ఎంజాయ్ చేస్తుంటారు. అందుకు సంబంధించిన విషయాలను ఆయనతో పాటు ఆయన భార్య నమ్రత సోషల్ మీడియా వేదికగా పోస్ట్ చేస్తుంటారు. మహేష్ తాజాగా స్పెయిన్ వెళ్ళాడు..అదీ ఒంటరిగా. తిరిగి హైదరాబాద్ చేరుకున్నాడు. శంషాబాద్ విమానాశ్రయంలో మీడియా కంట పడ్డాడు. దీంతో వెంటనే మీడియా ప్రతినిధులు ఆయనను కెమెరాల్లో బంధించారు. వీడియోలు తీశారు. ఇందులో మహేష్ బాబు చాలా స్టైలిష్ గా కనిపిస్తున్నారు. లోపల గ్రే కలర్ టీషర్టు వేసుకున్న ఆయన పైనుంచి బ్రౌన్ కలర్ జాకెట్ వేసుకున్నారు. కూలింగ్ గ్లాసెస్ విత్ లాంగ్ హెయిర్ తో అదిరిపోయే లుక్కులో కనిపించారు. క్యూట్‌గా నవ్వుతూనే..ముందుకు సాగాడు. ప్రస్తుతం ఈ ఫోటోలు నెట్టింట వైరల్ గా మారాయి. మహేష్ వాకింగ్ స్టైల్ కూడా చాలా బాగుంది. ఎక్కడా మొహం మీద నుంచి చిరునవ్వు చెరగ నీయకుండా.. కారు వరకు నడుచుకుంటూ వెళ్లి కారెక్కారు. ఈ ఫోటోలు చూసిన అభిమానులు ఫుల్ ఖుషీ అవుతున్నారు. మహేశ్ బాబు లుక్ అదిరిందంటూ కామెంట్లు చేస్తున్నారు. అయితే మహేష్ బాబు తన కొత్త చిత్రం కోసమే ఈ లుక్ అంటూ మరికొంత మంది కామెంట్లు చేస్తున్నారు. మహేష్ బాబు ప్రస్తుతం మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్‌తో కలిసి ఓ చిత్రంలో నటిస్తున్నాడు. ఈ సినిమాలో మహేష్ బాబుని మునుపెన్నడూ చూడని పాత్రలో చూపించబోతున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రానికి గుంటూరు కారం అనే టైటిల్ పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. అలాగే ఇందులో మహేష్ డ్యూయల్ రోల్ చేస్తున్నారట. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్ పై ఎస్ రాధాకృష్ణ నిర్మిస్తున్న ఈ సినిమాకి ఎస్.ఎస్ తమన్ సంగీతం అందిస్తున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా జనవరి 13వ తేదీన ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.



## జైపూర్‌లో జూన్2న శర్వా,రక్షితల వివాహం

టాలీవుడ్ యంగ్ అండ్ టాలెంటెడ్ యాక్టర్స్ లో ఒకరైన శర్వానంద్, రక్షిత రెడ్డిల నిశ్చితార్థం ఇటీవలే జరిగింది. విషయం అందరికీ తెలిసిందే. టాలీవుడ్ లోనే మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్స్ లో ఒకడిగా ఉన్న శర్వానంద్ సైలెంట్ గా ఎంగేజ్ మెంట్ చేసుకొని అందరికీ షాకిచ్చాడు. ఈ నిశ్చితార్థం కార్యక్రమం చాలా సింపుల్ గా జరిగింది. అయితే అత్యంత సన్నిహితులు కుటుంబ సభ్యులు కొంతమంది సినీ సెలబ్రిటీలు ఈ వేడుకకు హాజరయ్యారు. ముఖ్యంగా మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ఉపాసన దంపతులతో పాటు అదితీరావు హైదరీ అక్కినేని అఖిల్ సిదార్థ్ హాజరయ్యారు. అయితే పెళ్లి వేడుక ఎప్పుడనేది మాత్రం ఎంగేజ్ మెంట్ కార్యక్రమంలోనూ వెల్లడించలేదు. నిశ్చితార్థం తర్వాత కూడా ఎలాంటి చప్పుడు లేకపోవడంతో.. వారిద్దరి పెళ్లి క్యాన్సిల్ అయినట్లు పెద్ద ఎత్తున వార్తలు వచ్చాయి. కానీ దీనిపై స్పందించిన శర్వా.. అదేం లేదని సినిమా షూటింగ్ వల్లే పెళ్లి కొంచెం ఆలస్యంగా జరుగుతందని క్లారిటీ ఇచ్చాడు.అయితే తాజాగా వీరిద్దరి పెళ్లికి సంబంధించిన అప్ డేట్సు వెలుగులోకి వచ్చాయి. రాజస్థాన్ లోని జైపూర్లో రక్షితారెడ్డిని హీరో శర్వానంద్ వివాహం చేసుకోనున్నారు. ఇందుకు సంబంధించిన పెళ్లి పత్రికలు కూడా ఇప్పటికే విడుదల అయ్యాయి. రెండు రోజుల పాటు అత్యంత వైభవంగా శర్వారక్షితల వివాహం జరగబోతుంది. జూన్ 2వ తేదీన మెహందీ వేడుకను నిర్వహించనున్నారు. ఆ మరుసటి రోజే పెళ్లి కొడుకు కార్యక్రమం జరగనుంది. అదే రోజు అంటే జూన్ 3వ తేదీన జైపూర్లోని లీలా ప్యాలెస్లో రక్షితతో శర్వానంద్ వివాహం జరగనుంది. రాత్రి 11 గంటల నుంచి వివాహ వేడుక ప్రారంభమవుతుంది. వీరి పెళ్లికి సినీ సెలబ్రిటీలతో పాటు బంధువులు స్నేహితులు ప్రముఖ రాజకీయ నాయకులు కూడా హాజరు కాబోతున్నట్లు సమాచారం. చూడాలి మరి మరికొద్ది రోజుల్లో జరగనున్న వీరి వివాహానికి ఎవరెవరు హాజరవుతారనేది. జనవరిలో శర్వానంద్ రక్షితా రెడ్డిల నిశ్చితార్థం జరగగా.. జూన్ లో వివాహం జరుగుతోంది. ఇంత గ్యాప్ రావడానికి కారణం శర్వానంద్ ఓ సినిమా షూటింగ్ లో బిజీగా ఉండడమే. శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో పీపుల్స్ మీడియా ప్యాక్టరీ బ్యానర్ పై వివేక్ కూచిబొట్ల టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ ఏడాది చివర్లో సినిమా విడుదల చేసేందుకు మేకర్స్ ఏర్పాట్లు చేస్తున్నారు.



## బిచ్చగాడు-2కు ఎపిలో మంచి బిజినెస్

అప్పట్లో సెన్సేషన్ అయిన 'బిచ్చగాడు' చిత్రానికి ఇప్పుడు సీక్వెల్గా 'బిచ్చగాడు 2' రాబోతుంది. విజయ్ ఆంటోని స్వీయ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాను మే 19వ తేదీన అత్యంత గ్రాండ్‌గా విడుదల చేయబోతున్నారు. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ ప్రమోషన్ కార్యక్రమాలను ముమ్మరం చేసింది. ఈ క్రమంలోనే తాజాగా హైదరాబాద్‌లో ఈవెంట్ను చేసింది. తెలుగులో మంచి ఇమేజ్ ఏర్పరచుకున్న విజయ్ ఆంటోని నటించడంతో పాటు సూపర్ హిట్ మూవీకి సీక్వెల్గా వస్తున్న 'బిచ్చగాడు 2' చిత్రానికి తమిళంలో మంచి బిజినెస్ జరిగింది. అలాగే తెలుగు రాష్టాల్లోన్రూ ఇది సత్తా చాటింది. తాజా సమాచారం ప్రకారం.. దీనికి నైజాంలో రూ. 2.20 కోట్లు సీడెడ్లో రూ. 1.00 ఆంధ్రా మొత్తంలో రూ. 2.80 కోట్లుతో కలిపి తెలుగులో రూ. 6.00 కోట్లు బిజినెస్ జరిగింది. 'బిచ్చగాడు 2' మూవీ ఆంధ్రప్రదేశ్ తెలంగాణలో కలిపి రూ. 6.00 కోట్లు బిజినెస్ జరుపుకోవడంతో.. రూ. 6.50 కోట్లు బ్రేక్ ఈవెన్ టా÷-గ్గ్÷ట్తో ఈ చిత్రం తెలుగులో విడుదల కాబోతుంది. అలాగే తమిళ వెర్షన్తో కలుపుకుంటే ఈ మూవీ ప్రపంచ వ్యాప్తంగా రూ. 16.00 కోట్లుకు పైగా బిజినెస్ను చేసుకుందని తెలిసింది. అలాగే మొత్తంగా 1000 థియేటర్లలో ఇది విడుదల అవుతుంది. బిజినెస్కు తగ్గట్లుగానే 'బిచ్చగాడు 2' మూవీకి తెలుగు రాష్టాల్లో్ర థియేటర్లు లభించాయి. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం.. ఇది ఆంధ్రప్రదేశ్ తెలంగాణలో కలిపి మొత్తం 300 థియేటర్లలో రిలీజ్ అవుతుందట.ఒకవేళ టాక్ బాగుంటే ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలిసింది. మొత్తానికి ఓ డబ్బింగ్ సినిమాకు తెలుగులో ఈ రేంజ్ బిజినెస్ థియేటర్లు లభించడం అంటే గొప్పే అని చెప్పాలి.

## బేబీ నుంచి సాంగ్ విడుదల చేసిన రష్మిక

యంగ్ హీరో ఆనంద్ దేవరకొండ హీరోగా వస్తున్న లేటెస్ట్ మూవీ బేబీ. ఈ సినిమాతో యూట్యూబ్ స్టార్ వైష్ణవి చైతన్య హీరోయిన్ గా పరిచయం కాబోతోంది. ఈ సినిమా నుండి ఇప్పటికే విడుదలైన సాంగ్స్, పోస్టర్స్ కి ఆడియన్స్ నుండి సూపర్ రెస్పాన్స్ వచ్చింది. సాయి రాజేష్ దర్శకత్వం వహించిన ఈ సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇక తాజాగా చిత్ర ప్రమోషన్స్ లో భాగంగా.. ప్రేమిస్తున్నా అనే సాంగ్ ను రిలీజ్ చేశారు మేకర్స్. ఈ పాటను నేషనల్ క్రష్ రష్మిక మందన చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ ఈవెంట్ కు చీఫ్ గెస్ట్ హాజరైన రష్మిక, ఆనంద్ దేవరకొండకు సపోర్ట్ గా నిలిచింది. అయితే.. ఈ వేడుకకు రష్మిక గెస్ట్ గా రావడం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. దీంతో నెటిజన్స్ కామెంట్స్ తో రెచ్చిపోతున్నారు. ఇదంతా విజయ్ దేవరకొండ ట్రైనింగ్ అని, విజయ్ కోసమే ఆనంద్ దేవరకొండకు రష్మిక సపోర్ట్ చేస్తుంది అంటూ కామెంట్స్ చేస్తున్నారు. మరి ఈ కామెంట్స్ పై ఇటు విజయ్ గానీ, అటు రష్మికా గానీ ఎలా స్పందిస్తారో చూడాలి. ఇక బేబీ సినిమాకు విజయ్ బిల్గానిన్ సంగీతం అందించారు.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in